


# నలుగురు మనుషులు — మూడు అడుగులు

బి. మధుసూదన రావు





"ది రివెంజ్" అని కొట్టొచ్చినట్టు కనిపించే బోర్డు గోడకు చేరవేసి ఉంది. ఎక్కడెక్కడి జనాన్ని ఆటోలు, రిక్షాలు దిగుమతి చేయటంతో సినిమా హాలు ఆవరణంతా హడావిడిగా ఉంది.

సినిమా హాలు ఎదురుగా రోడ్డుకు అటు వైపున సిగరెట్ బంక్‌లో కస్టమర్స్ రద్దీ కూడా అందుకు తీసిపోకుండా ఉంది. బంక్ పక్కనే ఒకతను ఎవరి కొరకో నిరీక్షిస్తున్నట్లు రోడ్డుపై నుంచి సినిమా హాలు ఆవల వరకు చూస్తున్నాడు. కాని పరీక్షగా చూసిన వారికి తెలుస్తుంది, అతను సినిమా హాలు పక్కనే ఉన్న బిల్డింగ్ వైపు తదేకంగా చూస్తున్నాడని.

"హౌస్‌ఫుల్' బోర్డు పెట్టడంతో టికెట్లు అందని జనం వెనక్కు వస్తున్నారు. పగ సాధింపు లభించని నిస్పృహ వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తున్నది.

బంక్‌లో కూడా రష్ తగ్గటంతో పక్కన నిలబడి ఉన్న ఆ ఆగంతుకుడు వచ్చి సిగరెట్ పాకెట్ అందుకున్నాడు.

"రాఘవరావు గారి ఇల్లు అదేనా?" సినిమా హాలు పక్కన ఉన్న ఇంటిని చూపిస్తూ బంక్ అతన్ని అడిగాడు.

"అవును."

"కాంట్రాక్టర్ రాఘవరావు అంటే అతనేకదూ?"

"అవును . . ." అనుమానంగా అడిగాడు బంక్ అతను "మీరేం చేస్తుంటారు? . . . మీకేం పని?"

"చెపుతాను . . .కొన్ని వివరాలు కావాలి."

"అడగండి. . . .చెపుతాను."

"ఏం కాంట్రాక్టు ఆయన చేసేది?"

"ముత్యాలముగ్గు చూడలా . . . అలాంటి కాంట్రాక్టరు"

"ఆయన గురించి వింటమేనా . . . చేతివాటం అనుభవం కూడా ఉందా?"

"అదొక కథ . . ."

"కొంచెం కిళ్ళీ కూడా కట్టి ఇవ్వండి' అని మరో సిగరెట్ వెలిగించాడు. ఆగంతుకుడు.

"ఆయనకు మా చెల్లెలు నిచ్చాం . . ."

"ఏమిటి? మీకు బావా?"

"కిళ్ళీ తీసుకోండి." కిళ్ళీ అందించి తిరిగి ప్రారంభించాడు.

"ఆయన అప్పుడు చాలా తక్కువ స్థితిలోనే ఉండేవాడు. తరవాత ఎలాగయితేనేం చాలా సంపాదించాడు. న్యాయం, అన్యాయం అని లేదు. డబ్బులు సంపాదించే మార్గం ఏదయితే, అదే న్యాయమని ఆయన ఉద్దేశం. అగ్ని ప్రమాదాలు, వరదలు వస్తే ఆయనకు పండగ; చందాల పేరున వసూలు చేసి స్వాహా చేయటం ఆయన ముఖ్యమైన బిజినెస్"

"మీ పేరు చెప్పారు కాదు" అన్నాడు ఆగంతుకుడు మధ్యలో.

"నన్ను చెప్పనివ్వండి . . . నా పేరు కదూ మీరడిగింది . . . నారాయణ . . . ఆయన . . . అదే . . . .రాఘవరావు ఎంత పిసినారో చెప్పటానికి వీలులేదు. దుండగాలు చేసి పాపపు సొమ్ముతో పైసా పైసా కూడబెట్టి ఇంతవాడు అయ్యాడు. ఎంత పిసినారి అంటే . . . ప్రాణం మీదకు వచ్చినా



పైసా తియ్యడు. ప్రాణంపోతే మరో జన్మ ఎత్తచ్చు— పైసా పోతే తిరిగి రాదని ఆయన సిద్ధాంతం."

"అన్యాయంగా సంపాదిస్తుంటే నలుగురికీ నిజం తెలియదా?".

"తెలిసి ఏమిటి ప్రయోజనం? అందరికీ తెలుసు అన్యాయాలు జరుగుతున్నాయని. వాటిని ఎదుర్కోటానికి ప్రజలందరినీ ఒక తాటి మీదకు తీసుకు రావటానికి, ఎదురు తిరిగితే జరిగే పర్యవసానానికి భయపడకుండా ప్రజలకు ధైర్యం చెప్పి అండగా నిలబడే నాయకుడు కావాలి. అథవా ఎవడైనా ముందుకు వచ్చినా, వాడు దేనికో ఆశ పడేవస్తున్నాడని వాడికి ఆశ పెట్టి వాడి నోరు మూసేవాడు. అలాటి నాయకులు దొరికినప్పుడు ప్రజలకు అంతకన్నా దిక్కేముంది? 'మన ఖర్మ' అని తిట్టుకోవటం తప్పించి??"

"పోనీ మీ చెల్లెల్ని బాగా చూసుకునే వాడా?"

"అదే చెప్పొచ్చేది. బయట ఎలాగైనా చావనీ . . . ప్రాప్తుడు. దానికి ఆ అదృష్టం కూడా కలగనీయలేదు . . . . మీకు బోర్ కొడుతున్నదేమో . . .

"లేదు . . . చెప్పండి." శ్రద్ధగా వింటున్న ఆగంతకుడు కథ ఎక్కడ మధ్యలో ఆగిపోతుందోనని ఆతృతగా అన్నాడు.

"నా చెల్లెలు గర్భిణిగా ఉన్న రోజులు. కదిలితే వొలికే నిండు కుండలా ఉండేది. నొప్పులు వచ్చి ఒక రోజు ఇంట్లో అవస్థపడుతున్నదట. పక్కవాళ్ళు డాక్టరును తెచ్చి డెలివరీ చేయించమన్నారట. కాని పిసినారి . . . .కొడుకు జనరల్ హాస్పిటల్‌లో చేరుస్తాను, రిక్షా ఎక్కమన్నాడట.

బతిమలాడిందట "రిక్షా ఎక్కలేను' అని . . . వినలేదు.

"జనరల్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళి క్యూలో నిలబెట్టాడు. నా చెల్లెలు మెలికలు తిరిగిపోతూ 'నా అన్నకు కబురు చేయండి . . . డాక్టరుకు చూపిస్తాడు . . . . ఇక నిలబడలేను" అని చెప్పి కింద పడిపోయింది.

"చిన్న ప్రాణం పోయింది . . . పెద్ద ప్రాణం పోయింది . . . అదే ఆఖరు మాట.

నేను అప్పుడు ఈ వూళ్ళో లేను. చనిపోయిన సంగతి కూడా నాకు కబురు పెట్టలేదు. ఆ నోట ఈనోటబడి నాకు తెలిసింది. తీరా వస్తే . . . ఏముంది? . . . .

ఇంకేవతనో పెట్టుకుని కులుకుతున్నాడు. ఇంక ఈ పశువుతో మాట్లాడేదేమిటని తిరిగిపోయాం. పదుగురు నోట్లో వూసినా వాడికీ సిగ్గులేదు.

నా అమ్మా, నాన్న చనిపోయాక నేను ఇక్కడికి చేరి వాడి చావు దేముడు ఎప్పుడు రాసిపెట్టాడని ఎదురు చూస్తూ కూర్చున్నాను" అని ఆగి చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకున్నాడు సిగిరెట్ బంక్ యజమాని నారాయణ.

"ఇంకేమైనా వివరాలు తెలుస్తాయా?"

గుట్టులు చెప్పాడు నారాయణ అక్కడికి పోతే మరి కొన్ని వివరాలు తెలుస్తాయని.

అప్పటి వరకు తీక్షణంగా కాసిన ఎండ తగ్గి, హటాత్తుగా మబ్బు పట్టింది.

ఆగంతుకుడు తిరిగి నడక ప్రారంభించాడు. రోడ్డు దాటి రాఘవరావు బిల్డింగ్ ముందున్న ఫుట్‌పాత్ మీద ఫర్లాంగు నడిచి కుడివైపు తిరిగాడు కొంచెం దూరంలో రోడ్డుకు అటువైపు ఆంజనేయ స్వామి గుడి ముందు ఫుట్‌పాత్ మీద కూర్చున్నాడు బిచ్చగాడు.

దారిన వెళ్ళేవాళ్ళు చిల్లర వేయటానికి ముందు "బొచ్చె' ఉంది. ఎదురుగా ఉన్న రాఘవరావు బిల్డింగ్ వైపు చూస్తూ ఏదో గొణుక్కుంటూ కర్రతో నేలను కొడుతూ కూర్చున్నాడు.

'నారాయణ చెప్పిన పిచ్చి— బిచ్చగాడు అతడే అయి ఉండవచ్చు' అనుకుంటూ రోడ్డు దాటాడు. ఆగంతకుడు.

దగ్గరకు వెళ్ళి పక్కన నిలబడి బొచ్చెలో అర్ధరూపాయి వేశాడు'

"ధర్మ ప్రభులు వర్ధిల్లాలి" అన్నాడు బిచ్చగాడు, ఆగంతుకుని పై నుంచి కిందకు చూస్తూ.

ఆగంతకుడు అటూ ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని "ఏం చేస్తు బాబా మంది?' అని అడిగాడు.

"ఏ పేరుంటే ఏందిలే . . . చిదంబరం"

"మంచి చోటనే కూర్చున్నావ్ నీడ పట్టున చల్లగా. పొద్దుట దేముడి గుడి, సాయంత్రం బిల్డింగ్ నీకు గొడుగు పడుతున్నాయి." బిల్డింగ్ వైపు చూస్తూ అన్నాడు ఆగంతుకుడు.

"దేముడి నీడ మాత్రం సత్యం బాబూ"

"ఏం? బిల్డింగ్ నీడ చల్లగా లేదా?"

"ఏం చల్లదనంలే బాబూ నిప్పుపెట్టి నీళ్ళు పోసినట్టుంది"

"నీకు పెద్ద కథ ఉన్నట్టుందే?"

కూపీ ప్రయత్నం ఫలించింది. చిదంబరం తన కథ మొదలు పెట్టాడు.

"ఆయన ఇంటి ముందు పెంకుటి గదిలో నేను కాపురం ఉండేవాడిని. ఇంటి ఆసామీ రాఘవరావు . . . అదే ఇప్పుడు ఈ బిల్డింగ్‌లో ఉంటున్న రాఘవరావు, ఆ రోజు సాయంత్రం ఏడు గంటలకు తనకేదో గుండెలో నొప్పిగా ఉందని గాభరాగా నా భార్యను కేకలు వేసి పిలిచాడట. నా భార్య లోపలికి పోయే సరికి నొప్పితో మెలికలు తిరుగుతూ కనపడ్డాడట. నా భార్యకు భయం వేసి డాక్టరును పిలుస్తానందట.

"అక్కర్లేదు, మందు తాగితే అదే తగ్గుతుంది. కాసేపు బాధ భరించాలి' అన్నాడు. అలమారాలో ఉన్న మందు కొంచెం కలిపి ఇవ్వమన్నాడు.

మందు కోసం నా భార్య లోపలి గదిలోకి పోయే సరికి హటాత్తుగా వెనక నుంచి వచ్చి పట్టుకుని తన కోరిక తీర్చమని బలవంత పెట్టాడు. అది బతిమిలాడింది. కాళ్ళాపేళ్ళా పడింది. పెనుగులాటలో దాని నెత్తికి గాయం అయి నెత్తురు కారుతూనే ఉంది . . . . .

పశువు . . . అనుకున్న పని చేశాడు"

"నివేం చేస్తున్నావ్?" ఆగంతుకుడు అడిగాడు.

"ఆ రోజున ఆయనకు రావలసిన సైకం పనులు చేయటానికి సాయంత్రం పోయాను . . . అంత ఆ తరువాత తూలుతూ వచ్చి నా ఇంట్లో పడింది నా భార్య. మానం పోగొట్టుకుని కొన వూపిరితో వాడు చేసిన దోపిడీ నాకు చెప్పి

సూపర్ బాల్ పెన్....
హాయిగా, మెత్తగా రాసేది.
కేమ్లిన్ సుప్రీమ్
ధృఢమైనదిగా రూపొందించబడిన నాజిల్. సొగసైనది, అధునాతనమైనది, వెండిలా మిల మిల మెరిసేది-ఉన్నత శ్రేణికి చెందిన బాటర్ పెన్.

S 794 Tel

ప్రాణం విడిచింది. నా భార్యను చెరిచి, చేతులారా ప్రాణం తీశాడు.

వాడివల్లే ఇలా అయ్యాను. చావలేక బతుకుతున్నాను. వాడి చావు ఎలా . . . ఎలా ఉంటుందో కళ్ళారా చూద్దామని ఎదురుచూస్తూ ఇక్కడ కూర్చున్నాను." చెప్తుతూ ముగించాడు చిదంబరం.

"నీకు గుర్తు చేసి బాధ పెట్టాను—క్షమించు బాబా మరి వాడిలో మార్పు ఏమైనా వచ్చిందా?"

"మార్పా? . . . పుటకతో వచ్చింది పుడకలతో కాని పోదు. వీడు మనిషి కాదు—పిశాచం. వాడి పాపం పెరుగుతూనే ఉంది . . . ఇంకా పండకే భూమ్మీద మిగిలి ఉనాడు.

"అంతటితో ఆగలేదన్నమాట?"

"వాడి వల్ల నాశనమైన కుటుంబం ఒకటి కాదు, రెండు కాదు. తెలిసిన కుటుంబాలన్నిట్లో నాశనం చేశాడు. వూళ్ళో నలుగురి నెత్తిన చేతులు పెట్టాడు. సినిమా హాలుకు అటువైపు ఫాన్సీ షాపు ఉంది . . . దాని ఓనరుకి వీడితో . . ."

"ఎక్కడ?" ఆత్రంగా అడిగాడు ఆగంతుకుడు.

గుర్తులు చెప్పాడు చిదంబరం.

"మళ్ళీ కలుస్తా బాబా" అంటూ వడివడిగా అడుగులు వేశాడు ఆగంతుకుడు.

కుండపోతగా వర్షం ప్రారంభం అయింది. ఉరుములు మెరుపులతో భూనభోంతరాలు కురుక్షేత్రంలా ఉన్నాయి.

వెనక్కి తిరిగి అదే రోడ్డు వెంట సినిమా హాలు మీదుగా ఫాన్సీ షాపు చేరాడు ఆగంతకుడు. షాపు గుర్తు పట్టాడు.

మాట కలిపి ఆరా తీస్తే అతను చెప్పాడు.

"నా పేరు రమణ. నా అన్న సుదర్శనరావు గుడ్డల వ్యాపారం చేసేవాడు. అందులో గుమాస్తా రాఘవరావు.

ఒకసారి అన్నకు జ్వరం వచ్చింది. చూడటానికి తరుచు వచ్చి పోతుండేవాడు. అన్నకు భయమేసి అతన్ని దగ్గరే ఉండమని చెప్పాడట. అన్న జ్వరంతో బాధ పడుతుంటే రాత్రిం బవళ్ళు పక్కన ఉండి ఎంత చాకిరీ చేశాడు.

ఒక రోజు అన్న ముఖం చూస్తుండగానే వచ్చ బడింది. అరగంట క్రితమే జ్వరానికి డాక్టరు ఇచ్చిన మందు తాగాడు. వెంటనే డాక్టరుకు కబురు చేశాడు. డాక్టరు వచ్చి ఏం చేయాలా అని ఆలోచించే సరికి అన్న ప్రాణం విడిచాడు. అనుమానం మీద పోస్టుమార్టం చేయిస్తే విష ప్రయోగం అని తేలింది.

పోలీసులు వచ్చి అన్న దగ్గర పనిచేసే వరద రాజుల్ని పట్టుకెళ్ళి హత్యానేరం మీద జైల్లో వేశారు. ఆనాడు అన్నకు జ్వరం మందు కలిపి ఇచ్చింది అతనేనట"

"జ్వరం మందులో విషం కలిపింది అతనేనా?"

"మామూలుగా వ్యాపారం లెక్కలు రాఘవరావు మీదే వదిలేవాడట అన్న. రాఘవరావు మోసం చేస్తూనే ఉండేవాడట. అంతకు వారం క్రితమే లెక్కల్లో తప్పు పట్టుకుని రాఘవరావును నిలవేశాడట అన్న. వరదరాజులుకు తెలియకుండా గ్లాసులో విషం



లతాంగి

చిత్రం : [illegible]

కలిపింది రాఘవరావేనని తరువాత తెలిసింది. కానీ సాక్ష్యం దొరకక తప్పించుకున్నాడు.

అన్నను ఆస్తి కోసం నేను చంపించానని వదినెకు నామీద తప్పుడు ప్రచారం చేసేడు. ఆస్తి, వ్యాపారంతో పాటు వదినెను కూడా వశం చేసుకున్నాడు. ఇప్పుడు వాడు ఉంటున్నది అన్న ఇల్లే. తరువాత వదినె చచ్చిపోయింది. అయినా వాడు ఇల్లు వదలలేదు. ఈలోగా ఇల్లు, వ్యాపారం తన పేర వ్రాయించుకున్నాడు" అని చెప్పి కూజా ఎత్తి గడగడా నీళ్ళు తాగేశాడు రమణ.

"మరి మీకు పగ తీర్చుకోవాలని లేదా?" అని "నాకు కొంచెం నీళ్ళు తెపిస్తారా?" అని అడిగాడు ఆగంతుకుడు.

"వాడిది కసాయి మనసు. అంతా వాడిలాగా పాపభీతి లేకుండా, నిర్దయగా ఉండలేరు కదా. పగ తీర్చుకోవటానికి సరైన మార్గం మర్చిపోవటమే. నలుగురి కడుపు గొట్టి, చావగొట్టి బతుకుతున్నాడు. దేముడు ఏదోనాడు శిక్ష వేయక పోతాడా?"

"ఇతర్లను దోపిడి చేసి సంపాదించింది కాకపోతే ఇప్పుడు రాజభోగాలు అనుభవిస్తున్న వాళ్ళందరూ న్యాయంగా సంపాదించారా?"

"వాళ్ళని దేముడే శిక్షించాలి."

"పోనీలే అనే ఈ ఉదాసీనత వల్లే వాళ్ళు తమ చర్యలన్నీ సబబు అనుకుంటూ తమ ఆలోచనలకు నలుగురూ అంగీకారం తెలిపినట్టుగా భావిస్తున్నాడు . . . . రాఘవరావుకు తగిన శిక్ష వేద్దామనే వచ్చాను."

"ఎవరు మీరు?"

"సుదర్శనరావు గారికి మందు గ్లాసు అందించి జైలు శిక్ష అనుభవించిన వాడిని . . ."

"నీవు? . . ." తడపడ్డట్టుగా అన్నాడు రమణ ఆటూ ఇటూ చూస్తూ ఎవరూ వినటం లేదు కదా! అనుకుంటూ.

"అవును . . . వాడి శవాన్ని మోయటానికి మీరు కలిస్తే నలుగురం అవుతాం. వాడి పాపం మోయటానికి ఈ నలుగురం చాలు' అన్నాడు వరదరాజులు.

"వద్దు . . .వద్దు . . . దేముడే వాడికి తగిన శిక్ష వేస్తాడు. అప్పటి వరకు వేచి చూడటమే మనపని. మన పగల్ని, వగల్ని కాలమే తీరుస్తుంది"

వరదరాజులు వెనకనే వచ్చి, ఫ్యాన్సీషాపు ముందు రోడ్డు మీద తారట్లాడుతున్నారు నారాయణ, చిదంబరం.

వాళ్ళని చూపించి "వాళ్ళు వెనక బరువు మోయటానికి సిద్ధం. ముందు బరువు మనం మోయాలి. రాఘవరావు శ్మశానయాత్ర మనమే చేయించాలి" అన్నాడు వరదరాజులు.

వర్షం తగ్గు ముఖం పట్టింది. ఫాన్సీషాపు పక్కనే రోడ్డు టర్నింగ్ ఉంది. అక్కడ రోడ్డు పక్కగా ఉన్న కాలువ వర్షం నీళ్ళతో ఉరవడిగా ప్రవహిస్తున్నది. మబ్బువల్ల చీకటి పడినట్టు అనిపిస్తున్నది.

వరదరాజులు వెనక్కి తిరిగి నారాయణను, చిదంబరాన్ని రమ్మని సైగ చేశాడు.

వాళ్ళు వస్తుండగా వెనక పెద్ద శబ్దం అయింది.

అంతా అటు పరిగెత్తారు. కారు పల్టీకొట్టి డ్రైవరు సీటులో ఉన్న మనిషి ఎగిరి ప్రవహిస్తున్న కాలువలో పడ్డాడు.

కారు చుట్టూ చేరిన జనం చూస్తూ నిలబడ్డారు.

గుంపును తోసుకుంటూ పోయాడు వరద రాజులు" ఒక్కరూ రక్షించే ప్రయత్నం చేయరేం? ఎవరు పడిపోయింది? అని అరుస్తూ.

మిగతా ముగ్గురు వెనకనే అడుగులు వేశారు.

"పడ్డది ఎవరో ఇక్కడ అందరికీ తెలుసు. రక్షించాలని ఒక్కడికి అనిపించకే చూస్తూ నిలబడ్డారు" అన్నాడు రమణ.

"కారు రాఘవరావుది. వాడే అయి ఉండవచ్చు" అందుకున్నాడు చిదంబరం.

"రాఘవరావే" అన్నాడు నారాయణ.

రాఘవరావు శవాకారంలో కాలువ ఉరవడిలో కొట్టుకు పోతున్నాడు. ఈ నలుగురూ కాలువ ఒడ్డునే పరుగెడుతున్నారు.

ఒక చోట శవం ఒడ్డుకు చేరింది.

వరద రాజులు పరుగెత్తుకుంటూ పోయాడు.

"నలుగురికి మోత బరువు తగ్గించాడు దేముడు . . . ఛీ . . . వీడి కర్మకాండలకి మూడు అడుగుల నేల కూడా అనవసరం" అంటూ కాలితో ఒక్క తాపు తన్నాడు.

తనకేం తెలియనట్టు కాలంలా ప్రవహిస్తున్న కాలువ శవాన్ని ఎక్కడికి తీసుకువెళ్తుందో ఎవ్వరికీ పట్టలేదు.

'ది రెవెంజ' మేట్నీ చూసి వస్తున్న జనం రాఘవరావు మరణ వార్త విని తృప్తిగా వూపిరిపీల్చారు.

*